క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ వెంకట జనార్ధన్‌కు స్వాగతం పలుకుతున్న సహచర ఉద్యోగులు

సీతానగరం: మండల తహసీల్దార్‌గా జి. వెంకట జనార్ధన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తానని చెప్పారు. ఆర్ఐ ఎన్. శ్రీనివాసరావు, సహాయ గణాంకాధికారి సతీష్‌కుమార్, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎన్‌వీ రమణకు విశాఖపట్నం బదిలీ జరిగిన సంగతి తెలిసిందే.

అభయహస్తం పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న గ్రామపెద్దలు

బలిజిపేట: డ్వాక్రా సంఘ సభ్యులకు ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లను బర్లి గ్రామంలో సోమవారం పంపిణీ చేశారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అభయహస్తం పేరిట పింఛన్లు మంజూరు చేసింది. బర్లి గ్రామానికి చెందిన ఇద్దరికి పింఛన్లు మంజూరు కాగా, గ్రామపెద్దలు పి.నారాయణరావు, బి.కృష్ణ, జి.అనసూయ పంపిణీ చేశారు.

పక్కాగా 'మధ్యాహ్న భోజన పథకం'

బలిజిపేట: మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా నిర్వహించాలని ఎంఈఓ -1 సామల సింహాచలం అన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సమ్మె చేయనున్న నేపథ్యంలో పథకం నిర్వహణకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఈ మేరకు మండలంలోని పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను సందర్శించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పలు సూచనలు చేశారు.

ముమ్మరంగా రబీ వరినాట్లు



కాట్రగడ-బి వద్ద వరినారు తీస్తున్న కూలీలు

భామిని: మండలంలో రబీ వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. నీటి వసతి ఉన్న పొలాల్లో రైతులు రెండో పంటగా వరిసాగు చేస్తున్నారు. ఇప్పటికే నారు మడులు సిద్ధమయ్యాయి. మండలంలోని బొమ్మిక, గురండి, నేరడి-బి, కాట్రగడ-బి, తదితర గ్రామాల్లో రైతులు వరినాట్లు వేయడంలో తలమునకలయ్యారు. పొలాలను దమ్ముపట్టి నాట్లు వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. బెంగాల్‌కు చెందిన వ్యవసాయ కూలీలతో లైన్ పద్ధతిలో వరినాట్లు వేస్తున్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా వెంకటదామోదర్



గరుగుబిల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా బొబ్బిలి వెంకటదామోదర్‌ను నియమిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో పీఏసీఎస్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన బొబ్బిలి అప్పలనాయుడు అనారోగ్యంతో గత ఏడాది సెప్టెంబర్ నెలలో మృతి చెందారు. తాత్కాలిక చైర్మన్‌గా బత్తల పకీరునాయుడుకు అధికారులు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం పూర్తిస్థాయి చైర్మన్‌గా బొబ్బిలి వెంకటదామోదర్‌ను, సభ్యులుగా బత్తల పకీరునాయుడు, తెంటు శ్రీరాములునాయుడును నియమిస్తూ రాష్ట్ర సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఏడాది జూలై నెల వరకు వీరు పదవిలో ఉంటారని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీ పరిశీలన



రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్

పాలకొండ: నగరపంచాయతీ పరిధి 7వ వార్డులో రేషన్ సరుకుల పంపిణీని తహసీల్దార్ వరహాలు సోమవారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ప్రతీ నెల సరుకులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రతీ నెల 5వ తేదీలోగా లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి రేషన్ సరుకులు అందించాలని ఎండీయూ ఆపరేటర్లకు సూచించారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య ఉన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

- మట్టి నమూనాల సేకరణకు ఇదే అనువైన సమయం
- ఏఓ శ్రావణ్



భూసార పరీక్షలకు సేకరిస్తున్న మట్టి

బలిజిపేట: క్రమపద్ధతిలో పంటలు వేయకపోవడం, రసాయన ఎరువుల విచ్చలవిడి వినియోగం వల్ల భూసారం రోజురోజుకూ తగ్గిపోతోంది. దీంతో దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. భూసారం తగ్గిపోకుండా తగిన ఎరువులు వేయాలంటే ముందుగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ శ్రావణ్ తెలిపారు. ప్రస్తుత వాతావరణం భూసార పరీక్షలకు అనువుగా ఉందని చెప్పారు. భూసార పరీక్షలు చేయడం వల్ల భూమికి ఏయే పోషకాలు కావాలో తెలుస్తుంది. దీంతో ఆయా ఎరువులను భూమికి వేయడం వల్ల నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని చెప్పారు. ఈ నేపథ్యంలో భూసార పరీక్షలకు సంబంధించి ఏఓ శ్రావణ్ పలు విషయాలను వెల్లడించారు.

భూసార పరీక్షల్లో దశలు..

- మట్టి నమూనా సేకరణ
- భూసార పరీక్ష కేంద్రంలో పరీక్షలు
- వారు ఇచ్చిన ఫలితాలు ఆధారంగా ఎరువుల సిఫార్సు.

మట్టి తీయడంలో జాగ్రత్తలు..

- పొలం గట్ల పక్క మట్టి తీయకూడదు.
- నీటి ముంపు ఉన్న దగ్గర తీయరాదు.
- చెట్ల నీడ ఉన్న దగ్గర, చెట్ల వేర్లు వ్యాపించి ఉన్న దగ్గర తీయరాదు.
- సేంద్రియ, రసాయన ఎరువులు వేసిన తర్వాత తీయరాదు.
- సేంద్రియ, రసాయన ఎరువులు వేసిన 50 రోజుల తర్వాత మట్టి నమూనాలు తీయాలి.
- చౌడు, ఆమ్ల నేలల్లో వేరువేరుగా మట్టి నమూనా సేకరించాలి. 15-30 సెంటీమీటర్ల లోతులో మట్టి నమూనాలు తీయాలి. ఎటువంటి చెత్త ఉన్నా దానిని తొలగించి 15-30 సెంటీమీటర్ల లోతులో 'వి' ఆకారం గుంత చేసుకోవాలి. ఒకే మందంలో పైనుంచి కింద వరకు పలుచన పొరలుగా తీసుకుని మట్టిని సేకరించాలి. జిగ్‌జాగ్ పద్ధతిలో 10 నుంచి 15 చోట్ల మట్టిని సేకరించాలి. దీనిని ఒక గోనెపై వేసుకుని ఏదైనా మట్టి గడ్డలు ఉంటే వాటిని చిదిమేయాలి. తర్వాత ఆ మట్టిని నాలుగు భాగాలు చేసుకుని ఒక్కో భాగం నుంచి కొంత మట్టిని తీసుకుని ఒక కిలో మట్టిని నమూనాకు తీసుకోవాలి.

స్థూల, సూక్ష్మ పోషకాలు లోపించకుండా:

భూసార పరీక్ష ఫలితం ఆధారంగా భూమికి ఏయే సూక్ష్మ, స్థూల పోషకాలు అవసరమో అధికారులు తెలియజేస్తారు. స్థూల, సూక్ష్మ పోషకాలుగా పిలువబడే నత్రజని, భాస్వరం, పొటాష్, జింకు, బోరాన్, సల్ఫర్, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, జిప్సమ్ (కాల్షియం, గంధకం) లోపిస్తే దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. ఈ లోపాన్ని గుర్తించి సకాలంలో వాటిని వేసుకుంటే దిగుబడులు పొందవచ్చు. ఇందుకు భూసార పరీక్షలు ఎంతో ఉపకరిస్తాయి.

చేయించుకోవాలి..



మండలంలోని 19 ఆర్‌బీకేల ద్వారా 1178 భూసార పరీక్షలకు అవసరమైన మట్టి నమూనాలు సేకరించాలని నిర్ణయించాం. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. వాటి ఫలితం ఆధారంగా ఎరువులు వేసుకోవచ్చు. దీంతో ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయి.

– శ్రావణ్, ఏఓ, బలిజిపేట.

కిడ్నీ బాధితులకు రూ.10 వేల పింఛన్



బాధిత కుటుంబాలకు పింఛన్ సొమ్మును అందిస్తున్న రంగునాయుడు

మక్కువ: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నిరుపేద రోగులకు డయాలసిస్ చేసుకోవడానికి పింఛన్ రూపంలో ప్రభుత్వం రూ.10 వేలు అందిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు అన్నారు. మండల కేంద్రంలో డయాలసిస్ పింఛన్ లబ్ధిదారులకు సోమవారం పింఛన్ డబ్బులు అందజేశారు. కొయ్యన్నపేట పంచాయతీ కంచేడువలస గ్రామానికి చెందిన మింది గౌరమ్మ, రౌతు సింహాచలంకు డయాలసిస్ పింఛన్ మంజూరు కావడంతో వారికి రూ.10 వేలు చొప్పున అందజేశారు.
అలాగే అదే గ్రామానికి చెందిన తాడ్డి సత్యవతి, ఆది నారాయణలకు దివ్యాంగ పింఛన్ మంజూరు కావడంతో రూ.3వేలు చొప్పున అందించారు. కార్యక్రమంలో కంచెడువలస నాయకులు బురిడీ చిన్నారావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పెంట సంజీవునాయుడు, వెల్ఫేర్ అసిస్టెంట్ రౌతు సతీష్ పాల్గొన్నారు.

సేంద్రియ కూరగాయల విక్రయం



కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

సీతంపేట: స్థానిక వైకేపీ కార్యాలయం వద్ద సేంద్రియ విధానంలో సాగు చేసిన కూరగాయలను సోమవారం విక్రయించారు. ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు ప్రతీ సోమవారం సేంద్రియ విధానంలో సాగుచేసిన కూరగాయలు, ఆకుకూరలను విక్రయించనున్నట్లు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు, సేంద్రియ సాగు ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పశువులకు మెరుగైన వైద్యసేవలు

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా కేంద్రం వాహనం ద్వారా పశువులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీఏ సీహెచ్ దీనకుమార్ అన్నారు. పశు ఆరోగ్యసేవా వాహనం ద్వారా సిబ్బంది పంపించిన దూడకు సోమవారం వైద్యం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సిబ్బంది పశువులను వాహనాల ద్వారా మండల కేంద్రంలోని పశువుల ఆస్పత్రికి పంపిస్తే వైద్యసేవలు అందించి, తిరిగి రైతు ఇంటి వద్దకు పంపిస్తున్నట్లు చెప్పారు. పశువులకు అత్యవసర వైద్యం అందించాల్సిన సమయంలో రైతులు 1962 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

విధుల్లో చేరిన మున్సిపల్ కమిషనర్

సాలూరు: సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా ప్రసన్నవాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆమె మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆపరేటర్ల నియామకానికి చర్యలు

గరుగుబిల్లి: గ్రామ పంచాయతీల్లో మంచినీటి పథకాల నిర్వహణకు ఆపరేటర్లను నియమాకం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ.. పంచాయతీలలో మంచినీటి పథకాల నిర్వాహణకు ఇద్దరు ఆపరేటర్లను నియమించనున్నట్లు చెప్పారు. ఆపరేటర్ల నియామకం తరువాత గ్రామాల్లో తాగునీటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

పాడిపశువులే.. సిరిసంపదలు

- వ్యవసాయంతో పాటు పశుపోషణ లాభదాయకం
- మేలుజాతి పశువుల ఎంపిక కీలకం
- పోషణలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే సంపద వృద్ధి



సంకరజాతి గేదెలు

గరుగుబిల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు పాడిపంటలే జీవనాధారం. ప్రకృతి వైపరీత్యాలు, ధరల పతనం, దళారుల మోసాలతో రైతులు వ్యవసాయంలో నష్టాలు చవిచూసినపుడు పాడిపశువులు అన్నదాతకు ఆసరాగా నిలిచి ఆదుకుంటున్నాయి. ప్రభుత్వాలు కూడా వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమను ప్రోత్సహించేలా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. పశుపోషణలో రైతులు సరైన అవగాహన పెంచుకుంటే సంపద వృద్ధి చెందుతుందని పశుసంవర్ధకశాఖ సిబ్బంది సూచిస్తున్నారు. మేలుజాతి పశువుల ఎంపిక, వాటి పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ, తదితర అంశాలపై పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పశుపోషణలో సరైన యాజమాన్య పద్ధతులు అవలంభిస్తే పశుసంపద వృద్ధి చెందడంతో పాటు రైతులకు లాభదాయకంగా ఉంటుందని అంటున్నారు. పశుసంవర్ధకశాఖ గణాంకాల ప్రకారం కురుపాం నియోజకవర్గంలో కురుపాం, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో సుమారు 65 వేల ఆవులు, గేదెలు ఉన్నాయి.

ఉత్తమ జాతుల ఎంపిక మేలు..

పాడి పరిశ్రమలో అధిక లాభాలు పొందాలంటే మేలుజాతి పశువులను ఎంచుకోవాలి. అధిక పాలు ఇచ్చే ముర్రాగేదె, సంకరజాతి ఆవులను పెంచుకోవాలి. పశువులకు సమతుల్య ఆహారం ఇవ్వాలి. నీరు, నీడ, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలి. ప్రాంతాలకు తగ్గట్టు పశువుల జాతులను ఎంపిక చేసుకోవాల్సి వుంటుంది. ఈత తరువాత సుమారు 60 రోజుల నుంచి 90 రోజులకు ఎదకు వచ్చేలా జాగ్రత్తలు పడాలి. నాణ్యమైన మేలుజాతి పశువులతో గర్భధారణ చేయించాలి. అప్పుడే సంకరజాతి పశువుల ఉత్పత్తితో పాడి పరిశ్రమ వృద్ధి చెంది అధిక పాలదిగుబడి సాధించే అవకాశం ఉంటుంది. సంకరజాతి పశువులు 18 నెలలకే యదకు వస్తాయి. దేశవాళి పశువులు మూడేళ్లవరకు యదకు రావు. అలాగే దేశవాళి ఆవులు, గేదెలు ఈత తరువాత 200 రోజులు పాలు ఇస్తాయి. అదే సంకరజాతి ఆవులు, గేదెలు ఏడాది వరకు పాలు ఇస్తాయి. అందువలన సంకరజాతి పశువులు ఎంపికకు ప్రాధాన్యతిస్తే అధిక లాభాలు సాధించవచ్చు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పశువులకు సీజనల్‌గా సంక్రమించే వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలి. ప్రధానంగా ఏలిక పాములు, నట్టలు, పిరుదలవాపు, క్షయ, ఎండువ్యాధి తదితర రోగాలు వచ్చే అవకాశం ఉంది. గాలికుంటువ్యాధి, పారుడు రోగం, గొంతువాపు, పొదుగువాపు వ్యాధులు వస్తాయి. వ్యాధులు సోకకుండా పశువులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు వాటి ఆవాసాలను శుభ్రం చేస్తుండాలి. ఏదైనా వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా పశువైద్యులను సంప్రదించి చికిత్స అందించాలి.

పాడి పరిశ్రమకు ప్రోత్సాహకాలు



పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను అందిస్తోంది. పశుదాణా, గడ్డిసాగు చేసే రైతులకు రాయితీలు అందిస్తోంది. అలాగే సబ్సిడీపై పాలుపితికే పరికరాలు అందిస్తోంది. పశువులు కొనుగోలు, పశువుల శాల నిర్మాణానికి రుణాలు కూడా మంజూరు చేస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా వృద్ధి చెందాలి. పశుపోషణ, పాలదిగుబడి పెంచేందుకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నాం.

– ఎస్.సురేష్, పశువైద్యాధికారి, గరుగుబిల్లి

ఫైలేరియా నివారణే లక్ష్యంగా వైద్యసేవలు



సుంకరివీధిలో రక్త నమూనాలు సేకరిస్తున్న హెల్త్ సూపరువైజర్ శర్మ

సీతానగరం: ఫైలేరియా నివారణే లక్ష్యంగా వైద్య సేవలు అందిస్తున్నామని.. ఇందులో భాగంగా రాత్రిపూట ఇంటింటికీ వచ్చి రక్తపూతలు సేకరించే వైద్యసిబ్బందికి ప్రజలు సహకరించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పావని, సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ కోరారు. మండల కేంద్రంలోని మెట్టువీధి, సుంకరివీధి, కుమ్మరివీధి, దేవాంగుల వీధుల్లో హెల్త్ సూపరువైజర్ శర్మ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సోమవారం రాత్రి రక్తపూతలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాత్రివేళ ప్రజలు నిద్రించే సమయంలో కుట్టే దోమల వల్లే ఫైలేరియా సోకుతుందన్నారు. దోమలకు స్థావరాలుగా ఉన్న కాలువల్లో మురుగును తొలిగించాలని, ఖాళీగా ఉన్న కొబ్బరి బురికెలను కాల్చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కుమారి, నవీన్, చంద్రినాయుడు, హరికృష్ణ, జి. శ్రీనివాస్, నారాయణరావు, మూడు గ్రామాల ఆశ వర్కర్లు పాల్గొని సేవలందించారు.

శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా బోధన



స్టడీ అవర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పోల వెంకటినాయుడు

- ప్రిన్సిపాల్ వెంకటినాయుడు

సీతానగరం: మండలంలోని జోగింపేట గిరిజన ప్రతిభా (స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్) విద్యాలయంలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా బోధన సాగిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పోల వెంకటినాయుడు అన్నారు. పది, ఇంటర్ విద్యార్థులకు నిర్వహిస్తున్న అదనపు తరగతులను సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరంలో 42 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నారని చెప్పారు. అలాగే ప్రథమ ఇంటర్ పరీక్షలు 80 మంది.. ద్వితీయ ఇంటర్ పరీక్షలు 85 మంది రాయనున్నారని తెలిపారు. సాధారణ తరగతులతో పాటు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

'అభిలాష'తో ప్రయోజనాలు



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఈశ్వరరావు, తదితరులు

సీతానగరం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'అభిలాష' గ్రంథాలయాలతో ఎన్నో ప్రయోజనాలున్నాయని ఎంపీడీఓ ఎం. ఈశ్వరరావు అన్నారు. మండలంలోని పెదభోగిలి – 1, 2 సచివాలయాల్లో నిర్వహిస్తున్న 'అభిలాష' సామాజిక గ్రంథాలయాన్ని మండల పరిషత్ ఏఓ ప్రసాద్, ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మలతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, గ్రామాల్లో పట్టభద్రులైన నిరుద్యోగులు పోటీపరీక్షలకు సిద్ధమయ్యేందుకు గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. అన్ని రకాల పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ జె. వెంకటరావు, జేపీ ఈదుబిల్లి రమేష్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యసనాభివృద్ధి కార్యక్రమం పరిశీలన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: మండలంలోని నారాయణపురం ఉన్నత పాఠశాలలో తెలుగు, సైన్స్, ఆంగ్లం, సోషల్, గణితం సబ్జెక్ట్ ఉపాధ్యాయులు లిప్ విధానంలో బోధిస్తున్న తీరును ఎంఈఓ -1 సామల సింహాచలం సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లిప్ రికార్డులను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో చిలకలపల్లి స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎం.గౌరీశంకరరావు, స్థానిక హెచ్ఎం రామారావు, రిసోర్స్ పర్సన్స్ బి.గణేష్, కె.సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న డీఎంఓ జగన్మోహనరావు

కొమరాడ: వసతిగృహంలో ఉంటున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని ఉలిపిరి, పెదఖేర్జిలలో ఉన్న గిరిజన సంక్షేమ వసతిగృహాలను సోమవారం ఆయన సందర్శించారు. అక్కడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వసతిగృహం అధికారుల వద్ద ఆరాతీసి పలు సూచనలు చేశారు. విద్యార్థులు కచ్చితంగా దోమతెరలు వినియోగించాలని, జ్వరం వస్తే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం కొమరాడ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు. 'ఆశా డే'ని కచ్చితంగా నిర్వహించాలన్నారు పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట వైద్యులు అరుణ్‌కుమార్, శ్యామల్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

వేతనదారుల సంఖ్య పెంచండి

వీరఘట్టం: ఉపాధిహామీ పనుల్లో వేతనదారుల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ సాల్మన్‌రాజు సూచించారు. స్థానిక కార్యాలయంలో ఏపీఓ సత్యంనాయుడుతో సమీక్షించారు. మండలంలో చేపడుతున్న ఉపాధి పనులపై ఆరాతీశారు. వేతనదారుడికి గరిష్ఠంగా రూ.272లు వచ్చేలా పనులు కల్పించాలన్నారు. మస్తర్లు, నమోదులో అవకతవకలు జరగకుండా పర్యవేక్షించాలని సూచించారు.